### వచ్చే ఏడాది మిల్‌ను ప్రారంభిస్తాం..



రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వచ్చే ఏడాది ఈ సమయానికల్లా పామాయిల్ ఫ్యాక్టరీలో మిల్‌ను ప్రారంభిస్తాం. ఆ తర్వాత రిఫైనరీని అందుబాటులోకి తీసుకొస్తం. ఇప్పటికే 284 ఎకరాల్లో పంట కోతకు వచ్చింది. ఆరుగురు రైతుల నుంచి టన్నుకు రూ.13,905 చొప్పున చెల్లించి.. మూడు టన్నులు కొనుగోలు చేశాం. రైతులతోపాటు ఇంజినీరింగ్, ఐటీఐ, ఫుడ్ టెక్నాలజీ కోర్సులు చేసిన యువతకు ఈ ఫ్యాక్టరీలో ఉపాధి దొరుకుతుంది. పరోక్షంగా ట్రాన్స్‌పోర్ట్, ఇతర షాపుల ఏర్పాటుతో చాలా మందికి మేలు జరుగుతుంది. ఫ్యాక్టరీ ఇక్కడ పెట్టడం ద్వారా చుట్టు పక్కల ప్రాంతాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడి అభివృద్ధి చెందే వీలుంది.

**- ఉదయ్‌కుమార్, సీఈవో, మ్యాట్రిక్స్ పామాయిల్ కంపెనీ**



అందుగులపేటలోని రైతు ఆశురెడ్డి తోటలో పామాయిల్ గెలలు

**● మందమర్రికి మంచి రోజులు**

# ఆయిల్ పామ్.. ఉపాధికి ఊతం..

**● మందమర్రిలో 70 ఎకరాల్లో ఫ్యాక్టరీ ● భూమిపూజ చేసిన మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్**

**● మొదటి విడుతలో మిల్.. రెండో దశలో రిఫైనరీ.. ● ఏడాదిలోగా పరిశ్రమ ప్రారంభించేందుకు చర్యలు**

**● ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి ● రైతులు, యువతలో హర్షం**

మంచిర్యాల, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి సిరుల మాగాణం మందమర్రి పట్టణం మరో అద్భుతానికి వేదికైంది. గత పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత పనితీరుతో 1/70 చట్టంలోకి పోయి అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఒక్క మందమర్రి పట్టణంలోనే దాదాపు రూ.172.35 కోట్ల అభివృద్ధి జరిగింది. తాజాగా.. రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మందమర్రి మండలం శంకర్‌పల్లిలో 70 ఎకరాల్లో పామాయిల్ ఫ్యాక్టరీ పనులకు భూమిపూజ చేశారు. సుమారు రూ.500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ ఫ్యాక్టరీతో మందమర్రికి మంచిరోజులు రానున్నాయి. రెండు విడుతల్లో ఫ్యాక్టరీని అభివృద్ధి చేయనున్నారు. తొలి విడుతలో ఏడాదిలోపే పామాయిల్ మిల్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండో దశలో రిఫైనరీని ఏర్పాటు చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే లోకల్ బ్రాండ్‌తో పామాయిల్ మార్కెట్‌లోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.ఈ ఫ్యాక్టరీతో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి దొరకనున్నది.

### రెండు జిల్లాలకు ఈ ఫ్యాక్టరే ఆధారం..

తెలంగాణలో వరి, పత్తితో పాటు ప్రత్యామ్నాయ సాగును పెంచాలి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను మన రైతులే పండించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఈ సాగును ప్రోత్సహించాలనే లక్ష్యం మేరకు మంచిర్యాల జిల్లాలో 2020లోనే ప్రయోగాత్మకంగా 284 ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యేక చొరవతో ముందుగా చెన్నూర్ నియోజకవర్గంలో పలువురు రైతులు ఆయిల్ పామ్ సాగు చేశారు. దీంతో ఈ ఏడాది ఆగస్టులో ఉత్తర తెలంగాణలోనే తొలి పామాయిల్ పంట మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి, జైపూర్, మందమర్రి ప్రాంతాల్లో చేతికొచ్చింది. ఈ మండలాలకు చెందిన ఆరుగురు రైతుల నుంచి ఇప్పటికే 3 టన్నుల పంటను సైతం పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్న మ్యాట్రిక్స్ కంపెనీయే కొనుగోలు చేసింది. అది ప్రభుత్వ గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయడంతో రైతులు సంతోష పడుతున్నారు. మంచిర్యాల జిల్లాతోపాటు ఆసిఫాబాద్ జిల్లా రైతులు పండించిన పంటలను ఈ ఫ్యాక్టరీయే కొనుగోలు చేయనుంది. రెండు జిల్లాల్లో ఇప్పటివరకు 3,300 ఎకరాల్లో పామాయిల్ సాగులోకి రాగా, ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 5 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన వేలాది మంది రైతులకు మేలు చేస్తూ.. స్థానిక యువతకు ఉపాధి కల్పించనున్న ఫ్యాక్టరీ రాకపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### కంపెనోళ్లే కొనుగోలు చేశారు..



నేను 2020లో ఐదెకరాల్లో పామాయిల్ వేసిన. ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో కొన్ని చెట్లు కోతకు వచ్చినయ్. తొలి కోతలో 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొక్కలు ఇచ్చిన కంపెనోళ్లే వచ్చి క్వింటాకు రూ.1390 చొప్పున కొనుగోలు చేసి పోయారు. ఇది ఒకేసారి వచ్చే క్రాప్ కాదు. ప్రతి 15 రోజులకోసారి క్రాప్ వస్తున్నది. మాది కొత్త పంట కావడంతో నెల రోజులకు ఒకసారి కోయాలి. ఇతర పంటలతో పోలిస్తే శ్రమ చాలా తక్కువ. నీటి అవసరం కూడా తక్కువ. చెట్టు చుట్టూ పదును ఉండేలా చూసుకుంటే చాలు. అంతర పంటలు సైతం సాగు చేసుకోవచ్చు. చాలా ఆనందంగా ఉంది. ఫ్యాక్టరీ వస్తే మా దగ్గర మరింత మంది రైతులు పామాయిల్ సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

**- రైతు అనుగు ఆశురెడ్డి, అందుగులపేట , మందమర్రి**

### శ్రమ తక్కువ.. లాభం ఎక్కువ



నేను 2020లో నాలుగెకరాలు, మరుసటి ఏడాది మరో 4 ఎకరాల్లో పామాయిల్ సాగు చేసిన. నెలన్నర కిందట ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నాకు మొక్కలు ఇచ్చిన కంపెనోళ్లే వచ్చి కొనుగోలు చేసిన్రు. ఇప్పుడు మా మందమర్రిలోనే ఫ్యాక్టరీ పెడుతున్నరు. మరో 10 రోజుల్లో ఇంకో క్రాప్ కూడా వస్తది. ఇతర పంటలతో పోలిస్తే శ్రమ తక్కువ, లాభాలు ఎక్కువగా ఉంటాయి. అదే వరి రెండుసార్లు సాగు చేస్తే ఏడాదిలో ఆరు నుంచి ఏడుసార్లు మందులు వేయాలి. ఆయిల్ పామ్‌కు నాలుగుసార్లు వేస్తే చాలు. రానున్న రోజుల్లో మంచి లాభాలు వస్తాయన్న నమ్మకం ఉంది.

**- ఎండీ జహీరుద్దీన్, రైతు, బొక్కలగుట్ట**

# గంగనీళ్ల జాతర

**నేడు శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్న కేటీఆర్**

- **రైతన్నలకు అంకితం చేసి నీటిని విడుదల చేయనున్న ఐటీ, పరిశ్రమల శాఖ మాత్యులు**
- **దిలావర్‌పూర్ మండలంలో రూ.714 కోట్లతో ప్యాకేజీ-27 పనులు**
- **రెండు దశాబ్దాల కల సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో సాకారం**
- **నిర్మల్ నియోజకవర్గంలో గల 99 గ్రామాల్లోని 50 వేల ఎకరాలకు సాగు నీరు**
- **అన్నదాత కండ్లలో ఆనందం.. మంత్రి అల్లోలకు అండగా ఉంటామని వ్యాఖ్య**



దిలావర్‌పూర్ పంప్‌హౌస్ వద్ద ట్రయల్‌లో భాగంగా నీటిని ఎత్తిపోస్తున్న సిస్టర్న్



నిర్మల్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ) : రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న గోదావరి జలాల ఎత్తిపోతల పథకం ఎట్టకేలకు సాకారం కానున్నది. మహా పోచమ్మ గంగనీళ్ల జాతరకు ముందే గోదావరి నదీ జలాల జాతర ఎత్తిపోయనుండడంతో అన్నదాత కళ్లల్లో ఆనందం వెల్లి విరుస్తున్నది. గోదావరి నీళ్లను ఎత్తిపోసే కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ నంబర్ 27,28 (శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి ఎత్తిపోతల పథకం) కలను సాకారం చేస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నేడు ఎత్తిపోతల పథకం ప్రారంభం కానున్నది. ప్రతి ఎకరానికి సాగు నీరందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ముందుకెళ్తున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నీటిని తరలించి సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాకు తాగు, సాగు నీరందించే ప్యాకేజీ 27, 28 ఎత్తిపోతల పథకం, సదర్మాట్ బ్యారేజ్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో పనుల్లో వేగం పుంజుకున్నది. కాగా.. ప్యాకేజీ 27 పనులు ఇప్పటికే 70 శాతం పూర్తి కావడంతో నిర్మల్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందనున్నది. రూ.714 కోట్లతో చేపట్టిన 27 ప్యాకేజీ ద్వారా నిర్మల్ నియోజకవర్గంలోని 99 గ్రామాల్లోని దాదాపు 50 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. అలాగే రూ.525 కోట్లతో చేపట్టిన 28 ప్యాకేజీ కింద ముథోల్ నియోజకవర్గంలోని 58 గ్రామాల్లోని 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనున్నది. అంతే కాకుండా నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని 18,016 ఎకరాలను స్థిరీకరించడం కోసం మామడ మండలం పొన్కల్ వద్ద గోదావరిపై సదర్మాట్ బ్యారేజీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆయా పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలోని చివరి ఆయకట్టుకు సాగు నీరందనున్నది.

### భూములకు డిమాండ్ పెరిగింది..



నాకు దిలావర్‌పూర్ గ్రామ సమీపంలో రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మా భూమి సమీపంలోనే ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్నారు. దీంతో మా భూములకు పుష్కలంగా సాగు నీరందనున్నది. ఒకప్పుడు ఇక్కడి భూములకు ఏ మాత్రం డిమాండ్ ఉండేది కాదు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో తెలంగాణ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి, సాగు నీటి సదుపాయాన్ని కల్పించడంతో మా భూముల ధరలు మూడింతలయ్యాయి. వచ్చే ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి రైతులంతా అండగా ఉండి మళ్లీ గెలిపించుకుంటాం. రైతుల మేలు కోసం సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా కృషి చేస్తున్నారు. మళ్లీ సీఎంగా కేసీఆరే రావాలి.

**- కోడె నవీన్, రైతు, దిలావర్‌పూర్.**

### సీఎం ప్రత్యేక శ్రద్ధ వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది..



ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతు. ఆయన ప్రతిక్షణం రైతుల మేలు కోసం ఆలోచించే మనసున్న మనిషి. నిర్మల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాలు గోదావరి నదికి సమీపంలోనే ఉన్నప్పటికీ సాగు నీటికి నోచు కోలేదు. ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. కాళేశ్వరంలో భాగంగా ప్యాకేజీ 27 ఎత్తిపోతల పథకం ద్వారా నిర్మల్ నియోజకవర్గానికి సాగు నీరందించాలన్న లక్ష్యంతో రూ.714 కోట్లు కేటాయించారు. సకాలంలో నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా పూర్తయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వల్లనే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ పథకాన్ని బుధవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ ప్రాంత రైతులు సంతోషంగా ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి, నియోజకవర్గ రైతులకు సాగు నీరందేలా చేసిన సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు.

**- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి.**

### నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

నిర్మల్ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం ప్యాకేజీ-27 (లక్ష్మీ నర్సింహాస్వామి ఎత్తిపోతల పథకం) నిర్మాణ పనులు 15 ఏళ్ల తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పూర్తయ్యాయి. ఈ పథకం కింద కాలువల నిర్మాణం కూడా పూర్తి కావడంతో నేడు(బుధవారం) మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ పథకం ద్వారా నిర్మల్ నియోజకవర్గంలోని దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి), కుంటాల, సారంగాపూర్, నిర్మల్, లక్ష్మణచాంద, మామడ, సోన్ మండలాల్లోని 99 గ్రామాల పరిధిలో గల చెరువులు, కుంటలకు నీరందించే అవకాశం కలిగింది. ఈ మేరకు బుధవారం స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ఎత్తిపోతల పథకానికి స్విచ్ ఆన్ చేసి కాలువలకు నీటిని విడుదల చేసి రైతులకు అంకితం చేయనున్నారు.

### ఇదీ ప్రాజెక్టు స్వరూపం

ప్యాకేజీ 27 పనులను మూడు యూనిట్లుగా విభజించి పనులను పూర్తి చేశారు. మొదటి యూనిట్ కింద 32 వేల ఆయకట్టును నిర్దేశించారు. ఇందులో భాగంగా దిలావర్‌పూర్ గ్రామ శివారులో సిస్టర్న్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీని ద్వారా లెఫ్ట్ మెయిన్ కెనాల్, రైట్ మెయిన్ కెనాల్‌లోకి సాగు నీటిని ఎత్తి పోయనున్నారు. యూనిట్-1 కింద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో గుండంపెల్లి వద్ద ఇప్పటికే పంప్‌హౌస్ నిర్మాణం పూర్తయింది. ఇక్కడ 6.70 కిలోమీటర్ల పొడువుతో అప్రోచ్ చానల్‌ను నిర్మించారు. లెఫ్ట్ మెయిన్ కెనాల్ పొడువు 29.50 కిలో మీటర్లు కాగా, ఈ కాలువ ద్వారా నీటి సరఫరా సామర్థ్యం 140 క్యూసెక్కులు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే రైట్ మెయిన్ కెనాల్ పొడువు 13.50 కిలోమీటర్లు కాగా, నీటి సరఫరా సామర్థ్యం 100 క్యూసెక్కులుగా ఉంది. ఇదిలా ఉంటే రెండో యూనిట్ కింద 5 వేల ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. దీని కోసం దిలావర్‌పూర్ గ్రామ శివారులో మొదటి పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ వద్ద రెండో పంప్‌హౌస్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి పంపింగ్ ద్వారా నీటిని ఎత్తి పోయనున్నారు. దీని పరిధిలో లెఫ్ట్ కెనాల్ పొడువు 7.50 కిలోమీటర్లు కాగా, రైట్ కెనాల్ పొడువు 3.75కిలోమీటర్లుగా ఉంది. ఆయా కెనాల్స్ నీటి సరఫరా సామర్థ్యం 20 క్యూసెక్కులుగా ఉంది. అలాగే.. 3వ యూనిట్ కింద 13 వేల ఆయకట్టును నిర్దేశించారు. సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామం వద్ద మూడో పంప్‌హౌస్ నిర్మాణంలో ఉంది. ఈ పంప్‌హౌజ్‌లోని రెండు పం పుల ద్వారా సరస్వతీ కెనాల్‌లో నుంచి నీటిని ఎత్తి పోయాలని ప్రతిపాదించారు. దీనికింద 17.50 కిలోమీటర్ల మేర లెఫ్ట్ కెనాల్, 1.90 కిలోమీటర్ల మేర రైట్ కెనాల్‌ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి.

### సంతోషంగా ఉంది..



దిలావర్‌పూర్ శివారులో నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఏడేళ్ల క్రితం ఈ భూమిని కొనుగోలు చేశా. ఇప్పటివరకు నీటి సదుపాయం లేకపోవడంతో కేవలం వానకాలంలో మాత్రమే వర్షాధార పంటలు పండేవి. కొత్తగా నిర్మించిన ఎత్తిపోతల పథకం ప్రారంభం కానుండడంతో ఇక మాకు సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఏడాదికి మూడు పంటలు పండించుకునే అదృష్టం కలిగింది. ఇంతకంటే సంతోషం ఏముంటుంది. ఇదంతా సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యమైంది. ఈ ప్రాంత రైతులు కేసీఆర్‌కు రుణపడి ఉంటారు.

**- కాలేవార్ రాంబాబు, రైతు, దిలావర్‌పూర్.**



కాలువ ద్వారా వెళ్తున్న నీరు



నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేసిన షామియానాలు

# జలాల వేడుకకు జననేత

- **ప్యాకేజీ-27 ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్**
- **పాక్‌పట్లలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన**
- **నిర్మల్‌లో సమీకృత మార్కెట్, అభివృద్ధి పనుల ప్రారంభం**
- **ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బహిరంగ సభ**
- **గులాబీ మయమైన నిర్మల్ పట్టణం**

**నేడు నిర్మల్ జిల్లాలో ఐటీ, మున్సిపల్ శాఖ మాత్యులు కేటీఆర్ పర్యటన**

నిర్మల్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ) : ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బుధవారం నిర్మల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి రూ.1,157 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ముందుగా ఉదయం 9.50 గంటలకు హెలీక్యాప్టర్ ద్వారా దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లికి చేరుకుంటారు. గ్రామ శివారులోని గోదావరి నది వద్ద నిర్మించిన ప్యాకేజీ 27 ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా దిలావర్‌పూర్ గ్రామ శివారులో నిర్మించిన సిస్టర్న్ వద్దకు చేరుకుంటారు. ఇక్కడే పంపింగ్ ద్వారా కాలువల్లోకి సాగు నీరు చేరుతోంది. కాలువల్లోకి గోదావరి జలాలు చేరగానే మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డిలు గంగమ్మకు వాయినం సమర్పించి పూజలు చేస్తారు. అనంతరం 11.10 గంటలకు సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామ శివారుకు చేరుకుంటారు. అక్కడే 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో నిర్మించనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం నిర్మల్‌తోపాటు, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో నిర్వహించే సమావేశంలో మంత్రి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు నిర్మల్ పట్టణంలోని పాత తహసీల్ కార్యాలయ స్థలం వద్దకు చేరుకుంటారు. అక్కడే రూ.10.15 కోట్లతో నిర్మించనున్న సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తారు. ఇదే ప్రాంగణంలో మరి కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను మంత్రి ఆవిష్కరిస్తారు. వీటిలో నిర్మల్ పట్టణంలో రూ. 2 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో నిర్మించే ధోబీఘాట్ పనులు, రూ.4 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే పలు అభివృద్ధి పనులు ఉన్నాయి.



గులాబీ మయమైన నిర్మల్‌లోని శివాజీ చౌక్

అలాగే పట్టణంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు అమృత్ పథకంలో భాగంగా రూ.62.50 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.50 కోట్ల నిధులతో నిర్మల్ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇలా మొత్తం రూ.1,157 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆయా పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మధ్యాహ్నం 12.55 గంటలకు నిర్వహించే ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్ పాల్గొంటారు. కాగా.. మంత్రి కేటీఆర్ పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డిలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాటు చేస్తున్న శిలాఫలకాలు



సమీకృత మార్కెట్ నిర్మించే స్థలంలో చదును చేస్తున్న రోడ్డు రోలర్



భారీ కటౌట్